# నిరుపేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- ఇండ్లు లేని వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించిన ఘనత కేసీఆర్‌ది
- మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాగౌడ్, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూపతిరెడ్డి



మనోహరాబాద్ మండలం రామాయిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ హేమలతా, ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డి

మనోహరాబాద్, నవంబర్ 1: నిరుపేదల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని, 60 ఏండ్ల ప్రతిపక్షాల పాలనలో జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదిన్నరేండ్లలో చేసి గ్రామాలను ఆదర్శంగా నిలిపారని మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పన్యాల భూపతిరెడ్డి తెలిపారు. బుధవారం మనోహరాబాద్ మండలం రామాయిపల్లిలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సీఎం కేసీఆర్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ పురం నవనీతరవి ముదిరాజ్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ నవనీతశ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సుమన విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌లు పార్వతీమల్లేశ్, నాగభూషణం, ఉప సర్పంచ్‌లు వెంకటేశ్, ధర్మేందర్, మహేందర్‌గౌడ్, రాజుయాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్లు రాహుల్‌రెడ్డి, భిక్షపతి, మైనార్టీ సెల్ మండల నాయకులు జావీద్‌పాషా, ఇర్ఫాన్, ముస్తఫా, నాయకులు పెంటాగౌడ్, శ్రీనివాస్, సాయిరాంగౌడ్, నరేందర్‌గౌడ్, శైలేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా.. పాల్గొన్న నోడల్ అధికారులు

- ఎగ్జిట్ పోల్స్ పై నిషేధం
- మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

మెదక్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రతి పౌరుడు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శినితో కలసి బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా నిఘా కోసం వీఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లను మభ్య పెట్టేందుకు ఎవరైనా అక్రమంగా నగదు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయడం, ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడే వాటిని లైవ్ ఫొటోలు, లైవ్ వీడియోలను సీ–విజిల్ యాప్‌లో పంపాలని తెలిపారు.

## ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్ ప్రభావం

ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశం ఉన్నందున ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126 – ఎ ప్రకారం ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురణలు, ప్రసారాలు చేయరాదని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7న ఉదయం 7 గంటల నుంచి, ఈ నెల 30న సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్‌పై ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం అమలులో ఉంటుందని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా రెండేండ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండు ఉంటాయని ఎన్నికల సంఘం పేర్కొన్నదని కలెక్టర్ తెలిపారు.

# ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



మెదక్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, నవంబర్1: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీలు, కేడీలు, సస్పెక్ట్‌ల వివరాల గురించి తెలుపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎసీ అడ్మిన్ మహేందర్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### చెక్ పోస్ట్‌ల వద్ద కేంద్ర బలగాలతో పహారా

ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చెక్ పోస్టుల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. బుధవారం జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలోని ఏడు చెక్ పోస్టుల్లో సాయుధ బలగాలతో పకడ్బందీగా, 24 గంటలు పహారా నిర్వహిస్తున్నామన్నారు. అక్రమ మార్గంలో ఎలాంటి మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభ పెట్టే వస్తువులను జిల్లాకు రాకుండా వివిధ శాఖల సమన్వయంతో 24 గంటలు పర్యవేక్షణలో చెక్‌పోస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం వాహన తనిఖీలు చేసి, నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సిబ్బందికి సూచించారు.

### ఓటును సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేట, నవంబర్ 1: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలు, భయభ్రాంతులకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. బుధవారం మెదక్ జిల్లాలోని రామాయంపేటలో పోలీస్ బలగాలతో కవాతు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 56 కేంద్రాల్లో పోలీస్ కవాతు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. జిల్లా అంతటా ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులతో గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగడమే తమ లక్ష్యమన్నారు. యువత తమ ఓటును కచ్చితంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 30న ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతాయన్నారు. పోలీస్ కవాతులో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, రామాయంపేట సీఐ లక్ష్మీబాయి, తహసీల్దార్ రజనికుమారి, రామాయంపేట, నిజాంపేట ఎస్సైలు రంజిత్, శ్రీనివాస్‌రెడ్డి, పారామిలిటరీ బలగాలు ఉన్నారు.




మాట్లాడుతున్న సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్

## సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్ చంద్రబోస్

మెదక్ అర్బన్, నవంబర్ 1: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని సిద్ధార్థ కళాశాలలో సైబర్ జాగరుకత దివస్‌ను పురస్కరించుకుని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సెల్‌ఫోన్‌తో ఎన్ని ఉపయోగాలు ఉన్నాయే, అన్ని అనర్థాలు కూడా జరుగుతున్నాయన్నారు. సెల్ ఫోన్ వినియోగంతో ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కష్టపడి సంపాదించుకున్న డబ్బును సైబర్ నేరగాళ్లు సాంకేతికతను, ప్రజల అమాయకత్వాన్ని ఉపయోగించుకుని దోచుకుంటున్నారన్నారు. సైబర్ క్రైమ్స్‌పై మనమంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. సైబర్ నేరాల గురించి 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీఐ సురేశ్, కానిస్టేబుల్ సతీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టాలి

- మెదక్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్

మెదక్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలోని అక్రమ మద్యం అమ్మకాలు, నిల్వ, రవాణాను అరికట్టాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎంఏ రజాక్ తెలిపారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రకటన షెడ్యూల్ 2023 దృష్ట్యా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం, నకిలీ మద్యం, బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలను అరికట్టేందుకు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు మెదక్ జిల్లాలో 9441401084 ఫోన్ నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. ఇది 24/7 పని చేస్తుందన్నారు. ఫిర్యాదులను ఈఎస్ అబ్దుల్ రజాక్ (8712658903), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్లు నాగేశ్వర్ రావు (మెదక్ 8712658922), ఎం.పద్మ (నర్సాపూర్ 8712658923), ఎస్.జయసుధ (రామాయంపేట 8712658924), ఎ.నరేందర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, జిల్లా టాస్క్ ఫోర్స్ (8712658926)లకు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

## ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

- డీఆర్డీవో అడిషనల్ పీడీ నిరోజ

పెద్దశంకరంపేట, నవంబర్1: ఉపాధి హామీ పనుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని డీఆర్డీవో అడిషనల్ పీడీ నిరోజ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన 13వ విడత సామాజిక తనిఖీ సమావేశం నిర్వహించారు. 1.1.2022 నుంచి 31.03.2023 వరకు నిర్వహించిన రూ.5 కోట్ల 63 లక్షల 7664 పై వివరాలు వెల్లడించారు. 27 గ్రామ పంచాయతీల పరిధిలో జరిగిన తనిఖీల్లో పలు గ్రామాల టీఏలు, కార్యదర్శుల మస్టర్ల కొట్టివేత హాజరులో దుర్వినియోగంపై రూ.27,146 రికవరీలు, రూ.14,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, ప్రభాకర్, ఎంపీడీవో రఫీకున్నీసా, ఏపీవో మోహన్ తదితరులున్నారు.



పీహెచ్‌డీ పట్టాను అందుకుంటున్న యోగా శిక్షకుడు అల్లి నరేశ్

## వ్యాయామ విద్యలో అల్లి నరేశ్‌కు డాక్టరేట్

చేగుంట, నవంబర్1: జీవన మంత్ర యోగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు అల్లి నరేశ్ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ 83వ స్నాతకోత్సవంలో పీహెచ్‌డీ పట్టాను వైస్ చాన్సలర్ డీ.రవీందర్, అమెరికాకు చెందిన అడోట్ సీఈవో పద్మశ్రీ శంతన్‌నారాయణ్ ఆధ్వర్యంలో అల్లి నరేశ్‌కు అందజేశారు. మెదక్ జిల్లా చేగుంటకు చెందిన అల్లి నరేశ్ శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. నరేశ్ డాక్టరేట్ పొందడంతో డీఈవో రాధాకిషన్, పీఈటీటీఎస్ మెదక్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, ఎంఈవో బుచ్చానాయక్, జీవన మంత్ర యోగా ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.